సాక్షి
కామారెడ్డి
సోమవారం । 27 । జనవరి । 2025


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కల నెరవేరింది

ఎల్లారెడ్డిలో 300 డబుల్ బెడ్ రూం ఇళ్లను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రారంభించి, లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /11.9

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

బల్దియాల ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: మున్సిపల్ పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలు ఉన్నాయి. మూడింటి ప్రత్యేకాధికారి బాధ్యతలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపాల్‌రావు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపాల్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గోపాల్‌రావును న్యాయమూర్తి హారిక సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పండరి, సతీష్, శ్రీకాంత్, సాయిబాబా, నవీద్ పాల్గొన్నారు.

సర్కారు బడికి చిన్నారి సాయం



భిక్కనూరు: కాచాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మర్రి అద్వైత అనే బాలిక తన కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న రూ. 16 వేలతో వైట్ బోర్డులను అందజేసింది. గ్రామానికి చెందిన మహిపాల్ కూతురైన అద్వైత హైదరాబాద్‌లోని ప్రైవేట్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతోంది. తన స్కూల్‌లో డిజిటల్ బోర్డుల ద్వారా విద్యాబోధన జరుగుతుంది. గ్రామంలోని సర్కారు బడిలో ఈ సౌకర్యం లేదన్న విషయం తెలుసుకుని తండ్రితో మాట్లాడి బోర్డులను కొని, ఆదివారం పాఠశాలకు అందించింది.

అర్హులందరికీ
సంక్షేమ ఫలాలు


జాతీయ పతాకానికి వందనం చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ

ఒక్కొక్కటిగా హామీల అమలు

- ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు..
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, వారికి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత పరిపాలనా భవనం ప్రాంగణంలో ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సంగ్వాన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ పథకంలో ఇల్లు ఇవ్వడానికి ప్రభుత్వం గ్రామ సభల్లో జాబితాలను ప్రదర్శించిందన్నారు. అర్హులను గుర్తించి, వారికి నాలుగు విడతల్లో రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఆదివారం నుంచి అమలు చేస్తున్న ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలలో అర్హుల జాబితాలో పేర్లు లేనివారినుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, ఇది నిరంతర ప్రక్రియని పేర్కొన్నారు.


దివ్యాంగురాలైన కలెక్టరేట్ ఉద్యోగి హారీష వద్దకు వచ్చి ప్రశంసపత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, ఎమ్మెల్యే కేవీఆర్

సంక్షేమ పథకాలు..

రేషన్ కార్డు లేని పేదలను గుర్తించి అర్హులైన వారిందరికీ కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామని కలెక్టర్ సంగ్వాన్ తెలిపారు. మీ సేవ కేంద్రాల ద్వారా రేషన్ కార్డులలో అదనపు కుటుంబ సభ్యులను చేర్చడానికి వచ్చిన దరఖాస్తులను గ్రామసభల ద్వారా ఆమోదించి, అర్హులను ఆయా కార్డుల్లో చేరుస్తున్నామన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామ సభలకు హాజరుకాలేని వారు మండల కేంద్రంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు ఇవ్వవచ్చని, పరిశీలన పూర్తయిన తర్వాత అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 2.54 లక్షల రేషన్‌కార్డుల ద్వారా నెలకు 5,454 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 1,49,318 మంది వినియోగదారులకు రూ.5 వందలకు గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని, ఇప్పటి వరకు 2,97,121 సిలిండర్లు పంపిణీ చేయడం ద్వారా రూ.13.80 కోట్లు సబ్సిడీ ఇచ్చామని వివరించారు. జిల్లాలో అన్ని రకాల పింఛన్లు కలిపి 1.64 లక్షల మందికి ప్రతినెలా రూ.36.67 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

మహాలక్ష్మి పథకం ద్వారా..

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2.20 కోట్ల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారన్నారు. దీనికిగాను మహిళలకు రూ. 101 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా జిల్లాలో 1,64,395 మంది వినియోగదారులకు 2 వందల యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. ఈ పథకం కోసం జిల్లాలో ఇప్పటివరకు రూ.51.10కోట్లు ఖర్చు చేశామన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా...

భూమిలేని రైతు కూలీ కుటుంబాలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వడానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించామని కలెక్టర్ సంగ్వాన్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పథకంలో పనిచేసిన భూమిలేని వ్యవసాయ కూలీలు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. జిల్లాలో 15,501 కుటుంబాలను గుర్తించామని, వారికి ఈ ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా జిల్లాలో 17 వేల మంది శస్త్ర చికిత్సలకు రూ. 38.40 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, కళాశాలల విద్యార్థులకు కామన్ డైట్ మెనూ అమలులోకి తీసుకువచ్చిందన్నారు. జిల్లాలో 9,742 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందని, వీటి నిర్వహణ కోసం రూ.12.65 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

రైతుకు ఆసరా..

రైతులను రుణ విముక్తులను చేయడం కోసం ప్రభుత్వం రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేసిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 1,00,258 మంది రైతులకు సంబంధించి రూ. 718 కోట్ల పంట రుణాలు మాఫీ అయ్యాయన్నారు. సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా ద్వారా ఏటా ఎకరాకు రూ.12వేల పెట్టుబడి సాయం అందనుందన్నారు. జిల్లాలో 434 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, వానాకాలం సీజన్‌లో పండిన 4,31,549 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. ధాన్యం విక్రయించిన 86,749 మంది రైతుల ఖాతాల్లో రూ.1,001 కోట్లు జమ చేశామని పేర్కొన్నారు. సన్న రకం వడ్లు విక్రయించిన 15,859 మంది రైతులకు రూ.5 వందల చొప్పున రూ.51 కోట్లు బోనస్‌గా చెల్లించామన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

గణతంత్ర ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అవి ఆహూతులను అలరించాయి. అనంతరం ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ఎస్పీ సింధు శర్మ, జిల్లా అటవీ అధికారి నిఖిత, అసిస్టెంట్ ఎస్పీ చైతన్య, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, ఆర్డీవో రంగనాథ్‌రావు పాల్గొన్నారు.




విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తూ చప్పట్లతో అభినందిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్, కలెక్టర్, అధికారులు, నాయకులు


సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

నాలుగు పథకాలకు శ్రీకారం

- మండలానికి ఒక గ్రామంలో ప్రారంభం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాలను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించారు. ఆయా కార్యక్రమాలలో ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

ప్రతి ఇంటికి లబ్ధి


లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు అందిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నస్రుల్లాబాద్: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నస్రుల్లాబాద్ మండలంలోని రాముల గుట్ట తండాలో నాలుగు పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాముల గుట్ట తండాలో 126 మందికి రైతు భరోసా, 39 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 27 మందికి కొత్త రేషన్ కార్డులు, రేషన్‌కార్డులలో 34 మంది పేర్ల నమోదు, 24 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అందాయన్నారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందించారు.

కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, మండల ప్రత్యేకాధికారి దయానంద్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ దుర్గం శ్యామల, నాయకులు పాల్త్య విఠల్, పెర్క శ్రీనివాస్, కంది మల్లేష్, రాము, ఇక్బల్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాం తర్వాత ఇప్పుడే..

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి రూరల్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో పేదలకు ఇళ్లు మంజూరయ్యాయని, మళ్లీ ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం నాగిరెడ్డిపేట మండలంలోని అచ్చాయపల్లి, ఎల్లారెడ్డి మండలంలోని మల్లయ్యపల్లిలలో నాలుగు పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జాబితాల్లో పేర్లులేనివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు వాటిని పునఃపరిశీలించి అర్హులకు ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందేలా చూస్తారన్నారు. ఎల్లారెడ్డి మండలం మాచాపూర్ గేట్ నుంచి అచ్చాయపల్లి మీదుగా ఎర్రారం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కొనసాగిన భవనంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కానుందన్నారు. కార్యక్రమాలలో ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారి రత్నం, తహసీల్దార్లు శ్రీనివాస్‌రావు, మహేందర్‌కుమార్, ఎంపీడీవోలు ప్రభాకరచారి, ప్రకాష్, నాయకులు ఊషాగౌడ్, సత్యనారాయణ, ప్రశాంత్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, రాంచందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, ఇమామ్, నర్సింహారెడ్డి, విక్రాంత్‌రెడ్డి, జీవరత్నం, సాయిబాబా, వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మల్లయ్యపల్లిలో రేషన్‌కార్డు మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

పేదల సంక్షేమమే ధ్యేయం

కామారెడ్డి రూరల్: నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. ఆదివారం గూడెంలో నిర్వహించిన నాలుగు పథకాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో 178 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 1,354 ఎకరాలకు రైతు భరోసా, 8 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 97 మందికి కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, మండల ప్రత్యేకాధికారి తిరుమల ప్రసాద్, తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీవో నాగవర్ధన్, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీరాజాగౌడ్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గోనె శ్రీనివాస్, గుడుగుల శ్రీనివాస్, నిమ్మ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుకు రైతుభరోసా మంజూరు పత్రాన్ని అందిస్తున్న షబ్బీర్ అలీ

ఎవరూ ఆందోళన చెందొద్దు

భిక్కనూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్ పేర్కొన్నారు. ఆదివారం భిక్కనూరు మండలం ర్యాగట్లపల్లిలో నాలుగు పథకాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగానే సన్న రకం వరి ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు రైతులకు బోనస్ అందిస్తోందని తెలిపారు. లబ్ధిదారులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి రజిత, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజకిరణ్‌రెడ్డి, ఏవో శోభ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి దేవేందర్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, నేతలు బల్యాల సుదర్శన్, భీంరెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, అనురాధ, రవీందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుకు రైతు భరోసా మంజూరు పత్రం అందిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి శరత్

హామీలు నిలబెట్టుకుంటున్నాం

నిజాంసాగర్/బిచ్కుంద/మద్నూర్/పెద్దకొడప్‌గల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. ఆదివారం నిజాంసాగర్ మండలంలోని సుల్తాన్‌నగర్, బిచ్కుంద మండలంలోని గుండెకల్లూర్, పెద్దకొడప్‌గల్ మండలంలోని చిన్నతక్కడ్‌పల్లి, మద్నూర్ మండలం రాచూర్‌లలో నాలుగు పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఆయా కార్యక్రమాలలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, పిట్లం ఏఎంసీ చైర్మన్ మనోజ్‌కుమార్, ఏఎంసీ వైస్‌చైర్మన్ శంకర్ పటేల్, మండలాల ప్రత్యేకాధికారులు శ్రీపతి, నగేష్, కిషన్, ఎంపీడీవోలు గంగాధర్, గోపాల్, లక్ష్మీకాంత్‌రెడ్డి, తహసీల్దార్లు భిక్షపతి, సురేష్, దశరథ్, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, రాంరెడ్డి, మురళీధర్‌గౌడ్, రాజు పటేల్, హఫీజ్ గౌస్, ఖలీల్, రవి పటేల్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సుల్తాన్‌నగర్‌లో ఆత్మీయ భరోసా మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మాచారెడ్డి : ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. రాజఖాన్‌పేటలో నాలుగు పథకాల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామంలో 56 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 27 మందికి రేషన్ కార్డులు, 85 మందికి రైతు భరోసా, 29 మందికి ఆత్మీయ భరోసా మంజూరు ఉత్తర్వులను అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్ రావు, మండల ప్రత్యేకాధికారి, డీపీవో శ్రీనివాస్‌రావు, పౌర సరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్‌బాబు, గృహ నిర్మాణ శాఖ పీడీ విజయపాల్‌రెడ్డి, ఎంపీడీవో నాగరాజు, తహసీల్దార్ శ్వేత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


లబ్ధిదారుకు రైతు భరోసా ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

క్లుప్తంగా

అధికారులను బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: అటవీ శాఖాధికారులను బెదిరించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మూడు నెలల క్రితం లింగంపేట మండలం ముంబాజీపేటకు చెందిన మంజా నర్సోడ్ అటవీ భూమిని చదును చేస్తుండటంతో జేసీబీని ఎల్లారెడ్డి ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కోలా శ్రీనివాస్ నాయక్ పట్టుకున్నారు. ఈ కేసు హైకోర్టులో ఉంది. అయితే ఆదివారం మంజా నార్సోడ్,రాథోడ్,గంగమ్మలు కార్యాలయంలోకి చొరబడి తమ జేసీబీని సీజ్ చేసినందుకు శ్రీనివాస్ నాయక్‌ను తిట్టి, చంపుతామని బెదిరించారు. అలాగే అటవీ శాఖ ఉన్నతాధికారులను అడ్డగించారు. తనను చంపుతామని బెదిరించారని శ్రీనివాస్ నాయక్ ఎల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గడికోటలో మన సంస్కృతి మేళా



దోమకొండ: దోమకొండ గడికోటలో ఆదివారం మన సంస్కృతి మేళా నిర్వహించారు. దోమకొండ గడికోట ట్రస్టు, లైఫ్ ఎన్‌జీవో సంస్థ ఆధ్వర్యంలో కామారెడ్డితోపాటు ఇతర జిల్లాల నుంచి పలువురు వివిధ రకాల వస్తువులు తయారు చేసి విభిన్న పద్ధతుల్లో స్టాళ్లు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత నైపుణ్యాలను ప్రోత్సహించి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను కల్పించడమే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ, లైఫ్ ఎన్‌జీవో ప్రతినిధి దేవరగట్టు బాలప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీవో రోషిణ్మ, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల విజేతలకు బహుమతులు అందజేత



కామారెడ్డి అర్బన్: రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు 'భారత ఆర్థిక వ్యవస్థలో పశు సంపద పాత్ర', 'రోడ్డు భద్రతలో విద్యార్థుల పాత్ర' అంశాలపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలకు అదనపు కలెక్టర్ విక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.దేవేందర్, సాయిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే రోజూ మద్యం అమ్మకాలు!

మోర్తాడ్: గణతంత్ర దినోత్సవం రోజున మద్యం అమ్మకాలపై నిషేధం ఉన్నా కొందరు తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగించారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం రావడంతో కొందరు ముందస్తుగా మద్యం కొని పెట్టుకొగా, మరికొందరు దళారుల నుంచి కొనుగోళ్లు జరిపారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, వేల్పూర్, మెండోరా, ముప్కాల్, భీమ్‌గల్, బాల్కొండ మండలాల్లోని వివిధ గ్రామాల్లో మద్యం అమ్మకాలకు అడ్డు అదుపులేకుండా పోయిందనే ఆరోపణలు ఉన్నాయి. బెల్టుషాపుల నిర్వాహకులు రెగ్యులర్‌గా మద్యం విక్రయించే చోట కాకుండా రహస్య ప్రాంతంలో మద్యం నిల్వ ఉంచి వ్యాపారం సాగించారు. అయితే మోర్తాడ్‌లో మద్యం అమ్మకాలపై పోలీసులకు సమాచారం అందించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా అలాంటిది ఏమి లేదన్నారు.

ఉత్తములకు ప్రశంసలు



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

గణతంత్ర దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ఎస్పీ సింధుశర్మ హాజరై ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. – కామారెడ్డిటౌన్



డాక్టర్ విజయలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ | రంగనాథ్‌రావు, ఆర్డీవో, కామారెడ్డి | రమేష్, ఎఫ్ఆర్‌వో, కామారెడ్డి | రాజేందర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ | మల్లికార్జున్, డీఎస్‌వో | ప్రవీణ్, కలెక్టర్ సీసీ



శ్రీనివాస్, డీపీవో | దేవేందర్, జిల్లా పశువైద్యాధికారి | వేణుగోపాల్, హెచ్ఈవో | ప్రేమ్‌కుమార్, తహసీల్దార్ | రాజారాం, సీపీవో | నర్సింలు, తహసీల్దార్



జ్యోతి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ | రజిత, సీనియర్ అసిస్టెంట్ | తిరుపతయ్య, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ | రవీందర్, సీఐ, ఎల్లారెడ్డి | సంపత్, సీఐ, భిక్కనూరు | రంజిత్, ఎస్‌హెచ్‌వో, సదాశివనగర్ | సర్ఫరాజ్, ఎస్‌హెచ్‌వో, రాజంపేట | రాముడు, ఆర్ఎస్సై, ఏఆర్, హెడ్ క్వార్టర్స్ | సౌజన్య, కానిస్టేబుల్, మాచారెడ్డి



ఇర్ఫాన్, కానిస్టేబుల్, కామారెడ్డి | స్వప్న, కానిస్టేబుల్, గాంధారి | నరేష్, కానిస్టేబుల్, కామారెడ్డి | రజిత, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా ఆఫీసర్ | నాగరాజు, ఎస్సీ హాస్టల్ వార్డెన్, కామారెడ్డి | రత్న, ఏడీఏ, ఎల్లారెడ్డి | తురాబొద్దీన్, ఆర్అండ్‌బీ ఏఈ, కామారెడ్డి | లక్ష్మణ్, జీజీహెచ్ కానిస్టేబుల్, కామారెడ్డి | అమృత రాజేందర్, ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ప్రతినిధి



పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ సింధు శర్మ



వేడుకల్లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, ప్రజలు

పేదల సొంత ఇంటి కల నెరవేరింది

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు
- ఎల్లారెడ్డిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ



లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇంటి తాళాలు అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: పేదల సొంత ఇంటి కల నెరవేరిందని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలోని 300 డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు ఇంటి తాళాలను అందజేసి, ఇంటి గదులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి మాట్లాడారు. ఎల్లారెడ్డిలో శిథిలావస్థకు చేరిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు ప్రత్యేక నిధులు కేటాయించి దాని నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన ఎలక్ట్రిక్ మీటర్లకు సంబంధించిన పనులు పూర్తి కాగానే పట్టాలు అందించి గదులను లబ్ధిదారులకు పూర్తిగా అప్పగిస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, ఏఎంసీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, కౌన్సిలర్లు నీలకంఠం, శ్రీనివాస్, బాలమణి, మహేశ్వరి, భూదేవి, ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం అరణ్య అర్బన్ పార్కు



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డిరూరల్: ప్రజల సౌకర్యార్థం అటవీశాఖ తరపున అరణ్య అర్బన్ పార్కును నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తెలిపారు. ఆదివారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట అటవీ శివారులో రూ.కోటి నిధులతో పార్కు నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. పార్కులో సైక్లింగ్‌తో పాటు సేద తీరేందుకు అనువుగా సౌకర్యాలు కల్పించడం సంతోషకరమని అన్నారు. జిల్లా అటవీ శాఖాధికారి నిఖిత, ఎఫ్‌డీవో రామకృష్ణ, ఇంచార్జి ఎఫ్ఆర్‌వోలు దివ్య, శ్రీనివాస్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, ఏఎంసీ చైర్ పర్సన్ రజిత, ఆర్డీవో ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

అంబేడ్కర్ గొప్ప మేధావి



ఎల్లారెడ్డిరూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప మేధావి అని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ కొనియాడారు. ఆదివారం ఎల్లారెడ్డి మండలంలోని సాతెలిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. అంబేడ్కర్ సంఘం నాయకులు మల్లన్న, గంగారాం, గైని రాజు, నరేందర్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జలందర్‌రెడ్డి, తదితరులున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాభారతిలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన



బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక కళాభారతిలో ఆదివారం సాయంత్రం అధికారికంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల, కళాశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయా టీమ్‌లకు కలెక్టర్ మెమెంటోలు బహూకరించారు. అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందు ప్రియ, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ



నాగారంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్



బీర్కూర్ మండలం రైతునగర్‌లో..



శివారు రాంరెడ్డిపల్లిలో..



తాడ్వాయి మండలం సంతాయిపేట్‌లో ..



రామారెడ్డి మండలం కన్నాపురం తండాలో..

సాక్షి నెట్‌వర్క్:రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాలకు జిల్లాలో ప్రజాపాలన గ్రామసభలలో దరఖాస్తు చేసుకున్న ఆశావహులకు ఆదివారం మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులను గుర్తించి ప్రతి ఒక్కరికీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా అందించారు. అంతకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని డిజిటల్ స్క్రీన్లపై ప్రదర్శించారు. మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేయగా, పేర్లురాని వారు నిరాశకు లోనయ్యారు.



లింగంపేట మండలం ఎల్లారంలో..



రాజంపేట మండలం నడిమి తండాలో..



బ్రాహ్మణపల్లిలో ..

కేంద్రమంత్రి బాధ్యతాయుతంగా మాట్లాడాలి

- ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రధాని మోదీ బొమ్మ పెట్టం
- నిధులు ఎలా ఇవ్వరో చూస్తాం
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్: కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మోదీ బొమ్మ పెట్టాలని, ఇందిరమ్మ పేరు మార్చాలని, లేకుంటే కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వదని వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రధాని మోదీ బొమ్మ పెట్టేది లేదని, నిధులు ఎలా ఇవ్వరో చూస్తామని ఆయన వ్యాఖ్యలు చేశారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఆదివారం మోపాల్ మండలం నర్సింగ్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. రాష్ట్రంలో అమల్జేస్తున్న సంక్షేమ పథకాలపై బీజేపీ నాయకులు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ దొందుదొందేనని ఎద్దేవాచేశారు. ఎమ్మెల్సీ కవిత అధికారం కోల్పోయిన తర్వాత బీసీ నినాదం ఎత్తుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ బీసీలకు 33శాతం రిజర్వేషన్లు అమల్జేస్తే బీఆర్ఎస్ 27శాతానికి తగ్గించిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం అమల్జేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టిందని గుర్తుచేశారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కామారెడ్డి టౌన్: కామారెడ్డి కలెక్టరేట్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి వెళ్లి పోలీసులు విచారణ జరిపారు. మృతుడి వయసు 60 ఏళ్లు ఉండొచ్చు. తెల్లటి గడ్డం, వెంట్రుకలు, ఎరుపు, గ్రీన్ కలర్ టీషర్టు ధరించి ఉన్నాడు. గుర్తు పట్టినవారు దేవునిపల్లి పోలీస్ స్టేషన్(8712686150, 8712686148) నంబర్లకు సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

నంబరు ప్లేట్లు లేని వాహనాల సీజ్



గాంధారి(ఎల్లారెడ్డి): నంబరు ప్లేట్లు లేని 30 ద్విచక్ర వాహనాలను ఆదివారం సీజ్ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ.. నంబర్లు సరిగా కనపడని వాహనాలను కూడా సీజ్ చేశామని చెప్పారు. మండల పరిధిలో ఎక్కడైనా నంబరు ప్లేట్లు లేని వాహనాలు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.